సాక్షి వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం। 14। నవంబర్। 2023



హత్యాయత్నం కేసులో ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి అరెస్ట్

హత్యాయత్నం కేసులో ప్రొద్దుటూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



ఆశలు సమాధి చేస్తూ...

మానసిక వికలాంగుడైన ఒక్కగానొక్క కుమారునికి ఏ కష్టం రానివ్వకుండా చూసుకోవాలనే ఉద్దేశ్యంతో తదుపరి పిల్లలు వద్దనుకుని చేసిన తల్లిదండ్రుల త్యాగం ఫలితమివ్వలేదు. - 8లో

గరిష్టం/కనిష్టం
32.3 /20.1

వాతావరణం

జిల్లాలో సోమవారం 20.1 – 32.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

క్రికెట్ ప్రేమికులకు 'కను'విందు

కడప స్పోర్ట్స్ : క్రికెట్ వరల్డ్ కప్–2023లో భాగంగా సెమీఫైనల్ మ్యాచ్‌లో తలపడనున్న ఇండియా–న్యూజిలాండ్ మ్యాచ్‌ను కడప ప్రజలు వీక్షించేందుకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) మైదానంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో 'ఫ్యాన్ పార్క్' పేరుతో భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి మ్యాచ్‌ను తిలకించే ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఏవైడీ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి లైవ్ మ్యాచ్‌ను ఉచితంగా వీక్షించవచ్చని తెలిపారు. క్రికెట్ అభిమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కబడ్డీలో వైవీయూ సత్తా



మూడోస్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించిన వైవీయూ పురుషుల కబడ్డీ జట్టు

వైవీయూ : జేఎన్‌టీయూ కాకినాడలో ఈనెల 9 నుంచి 12 వరకు నిర్వహించిన దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీల్లో యోగివేమన విశ్వవిద్యాలయం కబడ్డీ జట్టు జయకేతనం ఎగురవేసింది. ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు తలపడిన ఈ పోటీల్లో వైవీయూ పురుషుల జట్టు మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. దీంతో పాటు ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. వైవీయూ వీసీ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.

26న రజక ఆత్మ గౌరవ సభ




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రజక ఐక్యవేదిక నాయకులు

కడప సెవెన్ రోడ్స్ : రజక ఆత్మ గౌరవ సభ ఈ నెల 26 తేదీ గుంటూరులో జరుగుతుందని రజక సంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకుడు అర్కటవేముల జయరాముడు తెలిపారు. సోమవారం కడప నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో ఆత్మ గౌరవ సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు పిలుపుమేరకు జరగనున్న ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో రజకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం


కడప సెవెన్‌రోడ్స్ : దళితమిత్ర సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం కడప నగరంలోని తిలక్‌నగర్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా కె.బాబు, ఉపాధ్యక్షుడిగా పాన్నోలు బాల సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా మామిడి రామసుబ్బయ్య, కోశాధికారిగా చెన్నూరు విజయ్, కార్యదర్శులుగా గోవిందు, ఉపేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర దళిత మిత్ర అధికార ప్రతినిధి పెడబల్లె నాగభూషణం, వ్యవస్థాపక అధ్యక్షులు కె.రామాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ద్వారా సామాజిక న్యాయం కోసం కొత్త కార్యవర్గం కృషి చేయాలని కోరారు. దళిత మిత్ర సంఘం యువజన రాష్ట్ర అధ్యక్షులు నరహరి పాల్గొన్నారు.

అది మోదీ సభ



మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

ముద్దనూరు : హైదరాబాదులో జరిగిన మాదిగల విశ్వరూప సభ నరేంద్ర మోదీ సభలా వుందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ విమర్శించారు. ఆదివారం ఆయన ముద్దనూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండు రాష్ట్రాలలో సుమారు ఒకటిన్నర కోటి మంది మాదిగలున్నా కేవలం లక్ష మంది హాజరయ్యారని, అది కేవలం బీజేపీ విశ్వరూప మహాసభ అని ఆయన విమర్శించారు. ఒక రాజకీయపార్టీకి మన కులాన్ని తాకట్టుపెట్టినట్టుందని, ఢిల్లీలో బిల్లు పెట్టాల్సిన ప్రధాన మంత్రి హైదరాబాదుకు వచ్చి మీలో ఒకడిని అని చెప్పడం విడ్డూరమని ఆయన విమర్శించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.



• కార్తీక దీపాలు...వెలిగాయి

సోమవారం మధ్యాహ్నం నుంచి కార్తీక మాసం ప్రారంభం కావడంతో సాయంత్రం శివాలయాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. నెల రోజులపాటు జరగనున్న ఈ ఉత్సవాలలో భాగంగా తొలిరోజు కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయాలు ధ్వజస్తంభాల వద్ద ఆకాశదీపాలు వెలిగించారు. కడప మృత్యుంజయకుంట శివాలయంలో ఈఓ ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో అర్చకులు శశిధర్ పూజాధికాలు నిర్వహించి శాస్త్రోక్తంగా ఆకాశదీపం వెలిగించారు. మాసం ప్రారంభం సందర్భంగా తొలి దీపం వెలిగిస్తే మంచిదన్న భావనతో కొందరు భక్తులు కూడా కుటుంబాలతో కలిసి వచ్చి ఆలయ ఆవరణలో దీపాలను వెలిగించారు.



కడపలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కార్తీకం.. పవిత్రం

- మాసమంతా విశేష పూజలు
- సిద్ధమవుతున్న శివాలయాలు
- పౌర్ణమినాడు శివ కల్యాణాలు, కార్తీక దీపోత్సవం
- అటవీప్రాంత ఆలయాలపై ప్రత్యేక దృష్టి

రాజంపేటటౌన్/మదనపల్లెసిటీ: కార్తీకమాసం ప్రారంభమైంది. ఏటా దీపావళి అమావాస్య ముగియగానే పాడ్యమి నుంచి కార్తీకం మొదలవుతుంది. ఈ ఏడాది దేవదాయశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర మంతటా ఘనంగా కార్తీక ఉత్సవాలను నిర్వహించేందుకు అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

దేవదాయశాఖ ఆధ్వర్యంలో కార్తీక ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో కసరత్తు ప్రారంభమైంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని రైల్వేకోడూరులోగల శ్రీ భుజంగేశ్వరస్వామి ఆలయం, అత్తిరాల పరుశురామాలయం, సిద్దవటం మండలంలోని నిత్య పూజకోన, ఒంటిమిట్టలోని ముకుంద మల్లేశ్వరస్వామి, పొలతల శ్రీ మల్లికార్జునస్వామి, కడప నగరంలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి, దేవునికడప శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం, అల్లాడుపల్లె, రాయచోటిలలోని వీరభద్రస్వామి ఆలయాలు, ప్రొద్దుటూరు శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీక ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతిరోజూ..

కార్తీక మాసోత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఉదయం అభిషేకాలు, అలంకారాలు, విశేష పూజలు, సర్వదర్శనం నిర్వహిస్తారు. ప్రత్యేకించి నాలుగు సోమవారాల్లో ఆలయాలు భక్తులతో కళకళలాడనున్నాయి. ఈ సంవత్సరం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం లేదా మధ్యాహ్నం ఆయా ఆలయాలలో శివ కల్యాణాలు నిర్వహించి రాత్రి జ్వాలా తోరణం కార్యక్రమాలు చేపట్టనున్నారు.

విస్తృత ఏర్పాట్లు

జనావాసాల మధ్యన ఉన్న దేవాలయాల్లోనే కాకుండా ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లోని శివాలయాల్లో ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్ల అభివృద్ధి, బారికేడ్ల ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణ, లైటింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో లోపాలను దృష్టిలో పెట్టుకుని జనరేటర్లను కూడా సిద్ధంగా ఉంచుతున్నారు. అన్నదానాలు నిర్వహించనున్నారు.

సజావుగా దర్శనాలు

అవసరమైన మేరకు ప్రొటోకాల్ పాటించినా దర్శనాలలో సాధారణ భక్తులకే తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నామని దేవదాయశాఖ అధికారులు పేర్కొన్నారు. ఇందుకోసం ఆయా ఆలయాల ఈఓలు, ఇన్‌స్పెక్టర్లను పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేశామన్నారు. పరిస్థితిని బట్టి వారు పోలీసు బందోబస్తును కోరవచ్చన్నారు. ఆలయాల వద్ద తాత్కాలిక వైద్య సదుపాయాలు కల్పించేందుకు వారు కృషి చేస్తారని,అవసరమైనచోట ముందుజాగ్రత్తగా ఫైరింజన్ సహకారం కూడా తీసుకోవాలని సూచించామన్నారు. మండల స్థాయిలో ఈఓలు, ఇతర ఎండో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పారిశుధ్య చర్యలు

ఆలయాల వద్ద పారిశుధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నామని, భక్తులు కూడా ఈ విషయంగా తమకు సహకరించాలని దేవాదాయశాఖ అధికారులు కోరుతున్నారు. పొలతల, అల్లాడుపల్లె, నిత్యపూజకోనలోని కోనేర్లను శుభ్రం చేయాలని ఆదేశించామన్నారు. ముఖ్యంగా భక్తులు కోనేటిలోనూ, ఆ బయట ప్లాస్టిక్ కాగితాలు, వ్యర్థాలు వేయవద్దని సూచించారు. నదీ తీరాలు, అటవీ ప్రాంతాల ఆలయాలకు వెళ్లే సమయంలో కుంటలు, వాగుల్లో ఈతకొట్టడం మంచిది కాదని, పిల్లలు, యువకులను ఈ విషయంలో జాగ్రత్తగా ఉండేలా పెద్దలు శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

ముక్తికి మార్గం కార్తీకమాసం



హరిహరులకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసం కార్తీకం. ముఖ్యంగా కైలాస నివాసుడైన ఆ పరమేశ్వరున్ని ఈ మాసంలో భక్తిశ్రద్ధలతో స్వచ్ఛంగా రుద్రాభిషేకాలు, రుద్రపూజలతో పాటు బిల్వార్చన చేస్తే ఎంతో శుభప్రదం. విష్ణుమూర్తిని తులసిదళాలతో పూజిస్తే ఆయన అనుగ్రహం కలుగుతుంది. ముక్తికి మార్గం కార్తీకమాసమని చెప్పవచ్చు. – సాయిచక్రవర్తి, వేదపండితులు, మదనపల్లె

పూర్తయిన ఏర్పాట్లు



కార్తీకమాసంలో శివాలయాలకు భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు. అందువల్ల దేవదాయశాఖ పరిధిలో ఉన్న అన్ని శివాలయాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాం. అందువల్ల భక్తులు ప్రశాంతంగా శివాలయాలకు వచ్చి పూజలు నిర్వహించుకోవచ్చు.
– విశ్వనాథ్, జిల్లా దేవాదాయశాఖ అధికారి, అన్నమయ్యజిల్లా

వెలుగు జిలుగులు

వైభవంగా దీపావళి

కడప కల్చరల్ : దీపావళి పర్వదినాన్ని ప్రజలు ఆదివారం వైభవంగా నిర్వహించుకున్నారు. సాయంత్రం 6.00 గంటలకే వీధులన్నీ లక్ష్మి పటాసుల ధ్వనులతో మార్మోగాయి. పిల్లల అల్లరిని సూచిస్తూ తారాజువ్వలు రివ్వుమని ఆకాశానికి ఎగిరాయి. పెద్దల ఆనందానికి ఉదాహరణగా మతాబులు, చిచ్చుబుడ్లు, వెలుగులు చిమ్మాయి. పెద్దల ఆధ్వర్యంలో పిల్లలు కట్టలు తెగిన సంతోషంతో ఉత్సాహం ఉరకలేస్తుండగా టపాసులు కాల్చారు. ఉత్సాహం ఎక్కువైన పిల్లలు, యువకులు రోడ్లపైనే తారాజువ్వలు, లక్ష్మిబాంబులు పేలుస్తుండడంతో వాహనదారులు ఒకింత అసౌకర్యానికి గురయ్యారు. అయినా పిల్లల నుంచి వృద్ధుల వరకు టపాసులు కాల్చుస్తూ ఉత్సాహంగా గడిపారు. పిల్లలు పట్టుబట్టడంతో మతబేధాలు లేకుండా అందరూ టపాసులు కాల్చుకున్నారు. హిందువుల ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి దీపాలు తీర్చారు. కాంపౌండ్ గోడలపై దీపాల వరుసలు కనుల పండుగ చేశాయి.



పులివెందులలో బాణసంచా వెలుగులు

డిసెంబర్‌లో రచయితల సంఘం మహాసభలు

కడప కల్చరల్ : వైఎస్సార్‌జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు 23, 24 తేదీల్లో మహాసభలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రంలో సంఘం సభ్యులతో కలిసి ఆయన సంస్థ లోగోను ఆవిష్కరించారు. వైఎస్సార్ జిల్లా చరిత్ర, సంస్కృతి, సాహిత్యాల విశిష్టతను దశదిశలా చాటేలా ఈ మహాసభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు పలు ప్రక్రియల్లోని అంశాలపై, జిల్లా చరిత్ర, సంస్కృతి, పర్యాటకం, పత్రికా రంగాల సంబంధించి సదస్సుతోపాటు అవధానులతో స్వీయపరిచయం, కవిసమ్మేళనం, హాస్యావధానం తదితర అంశాలను నిర్వహిస్తామన్నారు. ఆయా రంగాల్లో ప్రముఖులైన వారిని ముఖ్య అతిథులుగా, వక్తలుగా ఆహ్వానిస్తామని, ఈ సందర్భంగా మహాసభల ప్రత్యేక సంచికను కూడా వెలువరించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లోగో చిత్రకారుడు సీహెచ్.వెంకటేశ్, గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్ సత్యాగ్ని, ఉపాధ్యక్షులు గానుగపెంట హనుమంతరావు, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కార్యదర్శులు జింకా సుబ్రహ్మణ్యం, డాక్టర్‌భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, సంయుక్త కార్యదర్శులు భూమిరెడ్డి స్వరూపరాణి, షేక్ షబ్బీర్, కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి, సభ్యులు డాక్టర్లు జి.వి.సాయిప్రసాద్, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, డాక్టర్ పాలెం వేణుగోపాల్, డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, డాక్టర్ ఎస్.రాజగోపాలరెడ్డి పాల్గొన్నారు.



మహాసభల లోగోలను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు


లక్ష్మీ వేంకటేశ్వరుడు

పోరుమామిళ్ల శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో దీపావళి సందర్భంగా ఆదివారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ ధనలక్ష్మీపూజ నిర్వహించారు. స్వామిని 20, 50 రూపాయల నోట్లను పూలదండలుగా తయారు చేసి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని, మండపాన్ని దివ్యంగా అలంకరించారు. ఆశ్వయుజ అమావాస్య రోజు నిర్వహించే ఈ పూజ వల్ల శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం లభిస్తుందని అర్చకులు తెలిపారు. – పోరుమామిళ్ల



మార్గం.. సుగమం!

ఒకట్రెండు కాదు వందేళ్ల సమస్యకు ఓ పరిష్కారం దొరికింది. సుమారు 25 గ్రామాల ప్రజల రాకపోకలకు 'మార్గం' సుగమమైంది. వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్ రెడ్డి కృషితో సమస్య పరిష్కారమైనందుకు ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఏమిటా దారి సమస్య.. ఇప్పుడెలా పరిష్కారమైంది.. తెలియాలంటే చదవాల్సిందే.



ఆర్‌యూబి (మాడల్)



మార్గం	: ముంబై-చెన్నై
స్టేషన్	: రైల్వేకోడూరు
రాకపోకల జనాభా	: ప్రత్యక్షంగా 20వేలు.. పరోక్షంగా మరో 10వేల మంది
సమస్య నుంచి విముక్తి	: 25 గ్రామాలకు

రాజంపేట : ముంబాయి–చెన్నై కారిడార్ రైలుమార్గంలోని రైల్వేకోడూరు ఆర్‌యూబీ నిర్మాణానికి మోక్షం లభించింది. వేలాది గ్రామీణులు, విద్యార్థుల దారి సమస్య పరిష్కారపట్టాలెక్కింది. 1857 ప్రాంతం నుంచి ఇక్కడ సింగల్‌లైన్ ఉండేది. ఆ సమయంలో ఒక (మీటర్‌గేజ్) రైలుమార్గం ఉన్నందువల్ల స్థానికులు కొంతమేర సులభంగా దాటుకుంటూ రాకపోకలు సాగించేవారు. కాలక్రమంలో మీటర్ గేజ్ లైన్ కాస్త బ్రాడ్‌గేజ్‌గా మారిపోయింది. పైగా స్టేషన్ విస్తరణలో భాగంగా యార్డులైన్లుతో పాటు లూప్‌లైన్లు నిర్మితం చేయడంతో ప్రజలకు రాకపోకలు ఇబ్బందులుగా మారాయి.

నిరసనలు..ఆందోళనలు

1948 ప్రాంతంలో రైల్వేస్టేషన్‌కు అవలివైపున హైస్కూలు ఏర్పాటైంది. దశలవారీగా ఆ ప్రాంతంలో వివిధ విద్యాసంస్థలు వెలిశాయి. ఈ క్రమంలో గంటల తరబడి గూడ్స్‌రైళ్లు నిలబడటంతో విద్యార్థులు వాటి కింద దూరి పోయేవారు. ఈ పరిస్థితుల్లో రైలు కదలడం అనేక మంది మృత్యువాతకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వివిధ సంఘాలు నిరసనలు, ఆందోళనలు చేసి చేసి అలసిపోయారు.

ఆర్‌యూబీకి మోక్షం రావడంతో..

కోడూరు ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) విషయమై రాజంపేట లోక్‌సభ సభ్యుడు మిథున్‌రెడ్డి రైల్వేబోర్డు, రైల్వేమంత్రిత్వశాఖలతో నిరంతర సంప్రదింపులు, వినతులు ఇచ్చారు. ఆయన కృషి ఫలితంగా ఎట్టకేలకు ఆర్‌యూబీ మంజూరైంది. దాదాపు రూ.10కోట్లకు పైగా వ్యయంతో ఆర్‌యూబీ నిర్మాణ పనులను ఇటీవల ఎమ్మెల్యే కొరముట్లతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఇక ఎంచక్కా రాకపోకలు సాగించవచ్చని కోడూరువాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది..



కోడూరు స్టేషన్ ఆవలివైపు ఉన్న హైస్కూల్‌లో 1975లో క్లర్క్‌గా చేరాను. అప్పటి నుంచి రిటైర్డ్ అయ్యే వరకు అదే హైస్కూల్‌లో పనిచేస్తూ వచ్చాను. నిత్యం రైలుపట్టాలు దాటి హైస్కూల్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఎంపీ కృషి వల్ల ఆర్‌యూబీ మంజూరైంది. – గంగయ్య, చిట్వేలి

కష్టాలు తీరనున్నాయి



రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి కృషి ఫలితంగా వేలాదిమంది రాకపోకలకు కష్టాలు తీరాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎంపీ కృషితో ఆర్‌యూబీ నిర్మాణం జరుగుతోంది. ప్రజల రాకపోకలకు మార్గం సుగమం కానుంది. – కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యే, కోడూరు

చిరకాలస్వప్నం నెరవేరింది



రైలుపట్టాలపై దాటే అవసరం లేకుండా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసుల కృషితో రోడ్ అండ్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. ఆర్‌యూబీ వల్ల వేలాది మంది విద్యార్థులు, గ్రామీణులు లబ్ధిపొందనున్నారు. – తల్లెంభరత్ కుమార్‌రెడ్డి, డీఆర్‌యుసీసీ సభ్యుడు, కోడూరు

నాణ్యమైన విద్యే లక్ష్యం

- అంగన్వాడీ కేంద్రాల్లో ఉత్తమ బోధనకు ప్రభుత్వ చర్యలు
- ప్రీ స్కూలు యాక్టివిటీపై సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ
- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు కలిపి కార్యక్రమం

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. పిల్లలకు మంచి విద్యను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకుసాగుతున్నారు. ఇందులో భాగంగా అంగన్వాడీ కేంద్రాల పనితీరును పర్యవేక్షించే సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు పిల్లలకు ఇచ్చే విద్యాబోధనలో నాణ్యత, మెలకువలపై శిక్షణ ఇస్తున్నారు. అందుకోసం పూర్వ ప్రాథమిక విద్యాబోధనపై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే శిక్షణ పూర్తి చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న తమ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.



చిన్నారులకు విద్యాబోధన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్త

ఆరు రోజులపాటు శిక్షణ

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో పనిచేస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు కడప నగరంలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌లో 50–60 మంది చొప్పున ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే మూడు బ్యాచ్‌లు చొప్పున శనివారంతో శిక్షణ పూర్తయింది.

కాన్వెంట్లకు దీటుగా విద్యాబోధన

ప్రైవేటు కాన్వెంట్ల కన్నా దీటుగా అంగన్వాడీ కేంద్రాల్లో బోధన ఉండేలా ప్రీ స్కూలు యాక్టివిటీ (పూర్వ ప్రాథమిక విద్య)పై శిక్షణ ఇస్తున్నారు. ఇంకా ఎక్కువ మంది పిల్లలు కేంద్రాలకు వచ్చేలా శిక్షణా విధానం ఉండగా, ప్రీ స్కూలు కిట్లను కూడా ప్రభుత్వం అందించనుంది.

అంగన్వాడీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన బోధనను అందించేందుకు ప్రభుత్వం సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణను ఇస్తోంది. ప్రతి ఒక్క కార్యకర్తలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. – వసంతబాయి, సీడీపీఓ

శిక్షణతో ఉత్తమ ఫలితాలు



అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నాణ్యమైన బోధనను అందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఐసీడీఎస్‌లోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తి చేసిన తర్వాత తమపరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేసే కార్యకర్తలకు శిక్షణ ఇస్తారు. దీంతో ఉత్తమ ఫలితాలు సాధించొచ్చు. – శ్రీలక్ష్మి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి, కడప

రైలు కింద పడి వ్యక్తి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప రైల్వేస్టేషన్‌ యార్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే సీఐ నాగార్జున వివరాలు వెల్లడించారు. ఆదివారం తెల్లవారుజామున 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎరుపు, నీలం రంగు షర్టు, బ్లూ కలర్‌ జీన్స్‌ ప్యాంటు ధరించి ఉన్నాడు. అతని ఆచూకీ తెలిసిన వారు రైల్వే స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు. మృతదేహాన్ని రిమ్స్‌ మార్చురీకి తరలించామని, ఇతర వివరాలకు 94409 00811, 94406 27398 ఫోన్‌ నంబర్లలో సంప్రదించాలని వివరించారు.

స్కూటీని ఢీకొన్న బస్సు



బాలసుబ్బయ్య (ఫైల్‌)

కడప అర్బన్‌ : కడప నగర శివారులోని పోలీసు శిక్షణా కేంద్రం సమీపంలో ఆదివారం ఆర్టీసీ బస్సు స్కూటీని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. సిద్దవటం మండలం ఎస్‌.రాజంపేటకు చెందిన ఎస్‌.బాలసుబ్బయ్య (62) తన ద్విచక్రవాహనం (స్కూటీ)లో కడపకు వెళ్లి తిరిగి వస్తుండగా.. రాజంపేటకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు వున్నారు. మృతదేహాన్ని రిమ్స్‌ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

హత్యాయత్నం కేసులో ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి అరెస్ట్‌

- 15 రోజులుగా అజ్ఞాతంలో ఉన్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి ఘటనలో కేసు నమోదు



ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం : హత్యాయత్నం కేసులో ప్రొద్దుటూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని సోమవారం త్రీటౌన్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. వైఎంఆర్‌ కాలనీలోని తన ఇంట్లో ఉండగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్‌ అరెస్ట్‌ చేసి త్రీ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్టోబర్‌ 29న వైఎస్సార్‌సీపీ కార్యకర్త బెనర్జీని గాంధీరోడ్డులో భరత్‌కుమార్‌రెడ్డి కత్తితో నరికిన విషయం తెలిసిందే. పట్టపగలు జరిగిన ఈ సంఘటన పట్టణంలో సంచలనం రేపింది. కత్తిపోట్లకు తీవ్రంగా గాయపడిన బెనర్జీ చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి భరత్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డితోపాటు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలపై త్రీ టౌన్‌ పోలీసులు హత్యాయత్నం, కుట్ర, ఎస్సీఎస్టీ అట్రాసిటి కేసును నమోదు చేశారు. ఆ రోజు నుంచి నిందితుల కోసం మూడు ప్రత్యేక బృందాలతో పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. 15 రోజుల పాటు అజ్ఞాతంలో ఉన్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సోమవారం తన ఇంట్లో ప్రత్యక్షమయ్యారు. టీడీపీ పొలిట్‌ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి తదితర నేతలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. విషయం తెలియడంతో ప్రొద్దుటూరు ఇన్‌చార్జి డీఎస్పీ వంశీధర్‌గౌడ్‌ స్థానిక సీఐలతో కలిసి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. బెనర్జీపై జరిగిన హత్యాయత్నం కేసులో ప్రవీణ్‌ను అరెస్ట్‌ చేయడానికి వచ్చినట్లు పోలీసు అధికారులు తెలిపారు. కొంతసేపు అక్కడ పోలీసులకు, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసు వాహనం ఎక్కాలని పోలీసులు చెప్పగా.. ప్రవీణ్‌ అందుకు అంగీకరించలేదు. నడుచుకుంటూ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షల అనంతరం ప్రవీణ్‌ను కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అతనికి 14 రోజులు రిమాండ్‌ విధించగా, కడప సెంట్రల్‌ జైలుకు తరలించారు. టీడీపీ నేతలు పుత్తా నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, వీఎస్‌ ముక్తియార్‌, ఈవీ సుధాకర్‌రెడ్డి తదిరులు త్రీ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ వద్దకు వచ్చారు.

పరారీలో మరో ఇద్దరు నిందితులు

బెనర్జీపై జరిగిన హత్యాయత్నం కేసులో భరత్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలను అరెస్ట్‌ చేయాల్సి ఉంది. వీరిద్దరూ పరారీలో ఉన్నారు. వీరి కోసం ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని అరెస్ట్‌ చేయడంతో పరారీలో ఉన్న నిందితుల జాడ తెలిసే అవకాశం ఉందని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పారిపోలేదు

ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఎక్కడికీ పారిపోలేదని టీడీపీ పొలిట్‌ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. వైఎంఆర్‌కాలనీలోని ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఇంట్లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెనర్జీపై జరిగిన దాడి ఘటనలో ప్రవీణ్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల ఖర్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని పోలీసులు వెంబడించడంతో నిక్కర్‌(షాట్‌)తో పరారయ్యాడని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. తనను తాను సంరక్షించుకోలేని ప్రవీణ్‌ లాంటి వ్యక్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉండటం, ఆయన వెంట తిరగడం పార్టీ కార్యకర్తలకు పట్టిన ఖర్మ అని అన్నారు. స్థానిక ఆర్‌ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. దళితుడైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బెనర్జీపై గత నెల 28న మధ్యాహ్నం జరిగిన హత్యాయత్నం కేసులో ప్రవీణ్‌ నిందితుడిగా ఉన్నాడన్నారు. వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ సామాజిక సాధికార యాత్రలో పాల్గొనకూడదని హెచ్చరించి ఈ దాడికి పాల్పడ్డారన్నారు. నిందితునిగా ఉన్న ప్రవీణ్‌ను పట్టుకునేందుకు నాలుగు బృందాలుగా ఏర్పడి సీఐలు వెతుకుతున్నా అతనితోపాటు మొత్తం ముగ్గురు నిందితులు కనిపించలేదన్నారు. పోలీసుల ఎదుట హాజరై వాస్తవాలు చెప్పలేని ఇలాంటి వ్యక్తి పార్టీ ఇన్‌చార్జిగా ఉండటం దురదృష్టకరమన్నారు. పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు రాష్ట్రం వదిలి పారిపోయాడని, పార్టీ జెండాను పట్టించుకోలేదన్నారు.

హైదరాబాద్‌లో ఉండగా..

గత 16 రోజులుగా పోలీసులకు కనిపించని ప్రవీణ్‌ గత శుక్రవారం రాత్రి హైదరాబాద్‌ పరిధిలోని నార్సింగ్‌ రిసార్ట్‌లో ఉండగా పోలీసులు గుర్తించారన్నారు. అతనిని పట్టుకునేందుకు వెళ్లే సమయానికి ప్రవీణ్‌ మద్యం సేవిస్తూ నిక్కర్‌తో కనిపించాడని పేర్కొన్నారు. పోలీసులు వెంబడించడంతో దొరక్కుండా, ఒంటిపై గుడ్డలు లేకుండా పారిపోయాడన్నారు. కేవలం నిమిషాల్లోనే ఈ సంఘటన చోటు చేసుకుందని తెలిపారు. ప్రవీణ్‌కు ఆశ్రయం ఇచ్చిన అతని సోదరుడు ప్రదీప్‌ కుమార్‌రెడ్డిపై సెక్షన్‌ 212 కింద కేసు నమోదు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ సానబోయిన శేఖర్‌ యాదవ్‌, కౌన్సిలర్‌ వరికూటి ఓబుళరెడ్డి, మాజీ సర్పంచ్‌ రమణయ్య పాల్గొన్నారు.

అవ్వ బదులు పనికి వెళ్లి..

- కరెంట్‌ షాక్‌ తగిలి మృత్యువాత



మృతి చెందిన శ్రీనివాసులు

రాజంపేట : మున్సిపాలిటీలో అవ్వకు బదులుగా పారిశుధ్య పనులు చేసేందుకు వెళ్లిన మనవడు మరణించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తున్న గుర్రం నాగమ్మ అనారోగ్యంగా ఉండటంతో.. నిద్రపోతున్న మనవడు శ్రీనివాసులు(16)ను లేపి, తనకు బదులుగా పనికి వెళ్లాలని పంపించింది. నూనివారిపల్లెలో కాంపాక్ట్‌ వాహనం వద్ద పనులలో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద కరెంటు షాక్‌ తగిలింది. ఈ సంఘటనలో దుర్మరణం చెందాడు. తన కోసం పనికి వెళ్లిన మనవుడు లేడన్న సమాచారంతో అవ్వ కుప్పకూలిపోయింది. నేను పోయినా బాగుండేది మనవడా అంటూ బోరున విలపించింది.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రాంతీయ వైద్యశాలలో మృతదేహాన్ని జెడ్పీ చైర్మన్‌ ఆకేపాటి, చైర్మన్‌ పోలా సందర్శించి సంబంధీకులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జెడ్పీ చైర్మన్‌ ఫోన్‌ ద్వారా విషయం తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. మృతదేహాన్ని సీఐ నరసింహారావు పరిశీలించారు.

కడపలో వ్యక్తి దారుణ హత్య

వివాహేతర సంబంధమే కారణం



భవానీశంకర్‌ (ఫైల్‌)



రక్తపు మడుగులో మృతదేహం

కడప అర్బన్‌ : కడప నగరం వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధి ఎల్‌ఐసీ డివిజనల్‌ కార్యాలయం సముదాయంలోని ఓ గదిలో ఆదివారం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఎల్‌ఐసీ వారి ఈడీఎంఎస్‌ డిజిటలైజేషన్‌ విభాగం ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగి.. తన వద్ద పార్ట్‌ టైంగా పని చేస్తున్న వ్యక్తిని హత్య చేశాడు. వివాహేతర సంబంధమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ సంఘటనపై పోలీసులు, కుటుంబ సభ్యుల ప్రాథమిక సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి. కడప నగరంలోని నిరంజన్‌నగర్‌లో చిట్వేలి భవానీశంకర్‌(30) తన భార్య బాబాబీ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడితో కలిసి జీవనం సాగించే వాడు. భవానీశంకర్‌ 14వ డివిజనల్‌లో వలంటీర్‌గా, అతని భార్య 13వ డివిజన్‌లో వలంటీర్‌గా పని చేస్తున్నారు. మరోవైపు భవానీశంకర్‌ ఎల్‌ఐసీ డివిజనల్‌ కార్యాలయంలోని ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఎల్‌ఐసీలోని ఓ గదిలో ఎల్‌ఐసీ వారి ఈడిఎంఎస్‌ డిజిటలైజేషన్‌ విభాగం టీం లీడర్‌గా వున్న గుజ్జలి మల్లికార్జున దగ్గర పార్ట్‌టైం జాబ్‌ చేసేవాడు. వారిద్దరూ స్నేహితులు. ఈ విభాగంలో గతంలో భవానీశంకర్‌ భార్య బాబాబీ కూడా పని చేసేది. ప్రస్తుతం మల్లికార్జున దగ్గర భవానీశంకర్‌తోపాటు మల్లికార్జున భార్య శైలజ, మల్లికార్జున స్నేహితుడు, ఆటోడ్రైవర్‌ రంజిత్‌కుమార్‌ పని చేస్తున్నారు. మల్లికార్జునకు, కలసపాడుకు చెందిన తన అక్క కుమార్తె శైలజకు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె సంతానంగా ఉంది.

వివాహేతర సంబంధమే ప్రధాన కారణం

భవానీశంకర్‌ను అతని స్నేహితుడు మల్లికార్జున, మరో వ్యక్తి వల్లూరు మండలం పాపాఘ్నినగర్‌కు చెందిన రంజిత్‌కుమార్‌ అనే ఆటోడ్రైవర్‌తో కలిసి దారుణంగా హత్య చేశాడని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ సంఘటనకు కేవలం వివాహేతర సంబంధమే కారణమని తెలుస్తోంది. భవానీశంకర్‌, మల్లికార్జున భార్య శైలజతో వివాహేతర సంబంధం కలిగి వున్నాడని తెలుసుకున్నాడు. ఈనెల 11వ తేదీ రాత్రి నుంచి తన భార్య శైలజతో గొడవపడ్డాడు. ఈ నెల 12 తేదీన ఉదయం 7:30 గంటల సమయంలో తన భార్య శైలజతో భవానీశంకర్‌ను చంపిన తరువాతే ఇంటిలో అడుగుపెడతానని శపథం చేసి వెళ్లాడు. హత్య చేసేందుకు పథకం రచించాడు. తనతోపాటు వున్న రంజిత్‌కుమార్‌తో కలిసి ఆటోలో చింతకొమ్మదిన్నె మండలానికి వెళ్లాడు. అక్కడి నుంచి వైవీ స్ట్రీట్‌కు వచ్చి కత్తి, కొడవలిని తీసుకున్నాడు. తాను పని చేస్తున్న ఎల్‌ఐసీ ఆఫీసుకు వచ్చాడు. భవానీశంకర్‌కు ఫోన్‌ చేసి అత్యవసరంగా ఆఫీసుకు రావాలని పిలిచాడు. అతను గదిలోకి రాగానే గడియపెట్టి కత్తి, కొడవలితో దారుణంగా పొడిచాడు. అతను తేరుకునేలోపే మెడ, ఛాతీ, వీపు భాగాలపై కర్కశంగా నరికి చంపాడు. రక్తపు మడుగులో పడివుండగా.. రంజిత్‌కుమార్‌తోపాటు బయటకు వచ్చి పరారయ్యాడు. ఈ సంఘటన ఉదయం 9 గంటల నుంచి 10 గంటల సమయం మధ్యలో చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న హతుని భార్య బాబాబీ, తన బంధువులతో పాటు మృతదేహం వద్దకు చేరుకుని బోరున విలపించారు. సంఘటన స్థలాన్ని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్‌, సీఐ ఎస్‌.వి నాగరాజు, ఎస్‌ఐలు మధుసూదన్‌రెడ్డి, రంగస్వామి, సిద్దయ్యలు తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అదే రోజు సాయంత్రం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. నిందితులు పోలీసుల అదుపులో వున్నట్లు సమాచారం.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

కడప అర్బన్‌ : జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో కడప నగరంలోనే ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కడప చిన్నచౌక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని అశోక్‌నగర్‌కు చెందిన మణికంఠ(27)కు ఆరు సంవత్సరాల క్రిందట వివాహమైంది. వీరికి పిల్లలు లేరు. భార్య తనను వదిలేసి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసగా మారాడు. జీవితంపై విరక్తి చెంది.. ఆదివారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

రుణదాతల ఒత్తిడితో..

కడప టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని మోచంపేటకు చెందిన షేక్‌ యూనస్‌బాషా (46) ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. షేక్‌ యూనస్‌బాషాకు, కరీమున్నీసాకు కొన్నేళ్ల క్రిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2019లో ఉపాధి కోసం యూనస్‌బాషా ఖత్తర్‌కు వెళ్లాడు. అప్పుడు అప్పు చేసి వెళ్లాడు. 2021లో తిరిగి కడపకు వచ్చేశాడు. అప్పుల వాళ్ల ఒత్తిడి ఎక్కువైంది. ఈక్రమంలో కారు డ్రైవర్‌గా వెళుతూ జీవనం సాగిస్తున్నాడు. తాను విధులకు వెళ్లిన సమయంలో.. తన భార్య కరీమున్నీసా తన పిల్లలు నకాష్‌వీధిలోని తన సోదరి ఇంటికి వెళ్లేది. ఈక్రమంలో ఈ నెల 11న కారు డ్రైవర్‌గా వెళ్లిన యూనస్‌బాషా, తిరిగి ఈనెల 12న వచ్చాడు. తన భార్య, పిల్లలను అక్కడే వుండాలని.. తాను తిరిగి మరలా నకాష్‌కే వస్తానని చెప్పి ఇంటికి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

నిప్పంటించుకుని..



విజయలక్ష్మి (ఫైల్‌)

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని శ్రీశ్రీనగర్‌ కాలనీలో సోమవారం ఓ మహిళ నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. సీఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాల మేరకు.. శ్రీశ్రీనగర్‌ కాలనీకి చెందిన బొల్లెపు విజయలక్ష్మి(52)కి కుమార్తె కుమారుడు కలరు. కుమార్తెకు వివాహం చేసింది. కుమారుడు సింహాద్రిపురం మండలంలో వ్యవసాయ చేసుకుంటున్నాడు. బొల్లెపు విజయలక్ష్మి భర్త బొల్లెపు క్రిష్టారెడ్డి పదేళ్ల కిందటే మృతి చెందాడు. ఇంటిలో ఒంటరి ఉన్న ఆమె నిప్పంటించుకుని కాల్చుకుంది. మంటలు వ్యాప్తి చెందడంతో స్థానికులు ఇంటిలోకి వెళ్లి ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే పూర్తిగా కాలిపోయి మృతి చెందినది. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బావబామ్మర్దుల దుర్మరణం



మహేష్‌, యోహాన్‌(ఫైల్‌)

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బావబామ్మర్దులు దుర్మరణం చెందారు. దీంతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు, బంధువుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం రాజులపాడు గ్రామానికి చెందిన బింగి యోహాన్‌(31), తన బావమరిది నాగలూరు మహేష్‌(29) ఇద్దరూ కలసి తాపీ మేస్త్రీలుగా పని చేస్తూ జీవనం సాగించే వారు. వారు కమలాపురం మండలంలోని నల్లింగాయపల్లెలో నివాసం ఉంటూ.. సమీప గ్రామాల్లో బేల్దారి పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పనులు పూర్తి కావడం ఆలస్యం కావడంతో ఇంటికి వచ్చారు. ఆ సమయంలో తినడానికి ఏమీ లేక పోవడంతో పందిళ్లపల్లె వద్ద ఉన్న శ్రీకాంత్‌ హోటల్‌కు వెళ్లి భోజనం చేశారు. బైక్‌కు పెట్రోల్‌ పట్టించుకోవడానికి బంక్‌కు వెళుతూ రోడ్డు దాటుతుండగా.. ఎర్రగుంట్ల వైపు నుంచి కడప వైపు వెళ్లే లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో వారు బైక్‌తో సహా రోడ్డు పక్కనున్న పొదల్లో పడ్డారు. అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా యోహాన్‌కు భార్య విశ్వేశ్వరమ్మ, చిన్న వయస్సు గల కుమారుడు, కుమార్తె ఉన్నారు. అలాగే మహేష్‌కు భార్య బుజ్జమ్మ, ముగ్గురు చిన్న వయస్సు గల కుమారులు ఉన్నారు. బుజ్జమ్మ ప్రస్తుతం గర్భవతి.

అయ్యో.. పాపం

మానసిక వికలాంగ బాలుడి మృతి



తల్లిదండ్రులతో యోగేంద్రకుమార్‌ (ఫైల్‌)

కలసపాడు : తమ కుమారుడిని బతికించుకోవాలని వారి ఎంతో కష్టపడ్డారు.. అయినా వారి ఆశలు ఫలించలేదు. తమకు పుట్టిన మానసిక వికలాంగుడైన కుమారునికి ఏ కష్టం రానివ్వకుండా చూసుకోవాలనే ఉద్దేశంతో.. తదుపరి పిల్లలు వద్దనుకుని కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌ చేయించుకున్నాడు. వారి ఆశలు సమాధి చేస్తూ.. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు ఆదివారం రాత్రి మృతి చెందాడు. కలసపాడు మండలంలో చోటు చేసుకున్న ఈ హృదయ విదారక సంఘటన సంబంధించి వివరాల్లోకి వెళితే.. కలసపాడుకు చెందిన మునగలకుమార్‌, ఆదిలక్ష్మి దంపతులకు 14 ఏళ్ల క్రితం యోగేంద్రకుమార్‌ జన్మించాడు. పుట్టుకతోనే మానసిక వికలాంగుడు. భార్యాభర్తలిద్దరూ తదుపరి పిల్లవాడు పుడితే ఎక్కడ ముందు పుట్టిన వాడిని సక్రమంగా చూసుకునేందుకు వీలుపడదన్న దూర ఆలోచనతో.. పిల్లలే వద్దనుకుని కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌ చేయించుకున్నారు. అప్పటి నుంచి ఆ పిల్లాడిని అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. కష్టపడి సంపాదించిన వారి సంపాదనంతా పిల్లాడి వైద్యానికి ఖర్చు చేస్తుండేవారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా వైద్య పరీక్షల నిమిత్తం బెంగుళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తుండగా.. ఆదివారం రాత్రి మృతి చెందాడు. దీంతో ఉన్న ఒక్కగానొక్క బిడ్డ కోసం సర్వస్వం అర్పించి చేసిన త్యాగానికి ఫలితం లేకుండా పోయింది. ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతి చెందిన విద్యార్థి కలసపాడు ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో చదువుకుంటుండటంతో విషయం తెలుసుకున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి సోమవారం విద్యార్థి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ బి.రాజారెడ్డి, కంప్యూటర్‌ ఆపరేటర్‌ విజయకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

చౌక బియ్యం పట్టివేత

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ వద్ద అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ చౌక బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ బి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. జమ్మలమడుగు ప్రాంతం నుంచి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 400 బస్తాల రేషన్‌ బస్తాలతోపాటు, లారీని పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

డివైడర్‌ను ఢీకొన్న స్కార్పియో

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులోని బలపాల గుట్ట వద్ద స్కార్పియో వాహనం డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల నుంచి ప్రైవేట్‌ స్కూలు ఉపాధ్యాయులు గండి వీరాంజనేయ స్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. బలపాల గుట్ట సమీపంలో ఇద్దరు విద్యార్థులు స్కూటర్‌లో వస్తూ రోడ్డుకు అటువైపుగా మళ్లించారు. వేగంగా వస్తున్న స్కార్పియో వాహనం వారిని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొంది. సడన్‌గా బ్రేకులు వేయడంతో వాహనంలో ప్రయాణిస్తున్న 10 మంది ఒకరిపై ఒకరు పడటంతో వాహనంలో ఉన్న వారికి చిన్న గాయాలయ్యాయి. అందులో తులసి, మల్లేశ్వరి, రమణమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న చక్రాయపేట మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్‌ కొండారెడ్డి వారికి ధైర్యం చెప్పి.. తన వాహనంలో ప్రథమ చికిత్స కోసం వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అప్పు చెల్లించమన్నందుకు.. చంపేశాడు..



మృతి చెందిన సాయికిరణ్‌

కడప అర్బన్‌ : అప్పు చెల్లించాలని అడిగినందుకు ఓ వ్యక్తిని చంపేశాడు. ఈ సంఘటన ఆదివారం కడప నగరం చిన్నచౌక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని వైజంక్షన్‌ నుంచి కేశవరెడ్డి స్కూల్‌ మధ్యలో వున్న ఓ టీస్టాల్‌ వద్ద చోటుచేసుకుంది. ఈ సంఘటనపై చిన్నచౌక్‌ పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం మేరకు వివరాలిలా వున్నాయి. ఒంటిమిట్ట మండలం మంటపంపల్లెకు చెందిన పందికాళ్ల సాయికిరణ్‌ (25) సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తూ మానేశాడు. రోజూ తన ఇంటి నుంచి ఉదయం వచ్చి కడప నగరంలో ఓ షోరూంలో పని చేస్తున్నానని చెప్పి.. మరలా రాత్రి ఇంటికి వెళ్లేవాడు. పక్కీర్‌పల్లె సమీపంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన మహేంద్ర చిన్నచౌక్‌ పాత బైపాస్‌లో ఓ టీ స్టాల్‌ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో సాయికిరణ్‌.. మహేంద్రకు పరిచయమయ్యాడు. మూడు నెలల క్రిందట సాయికిరణ్‌ నుంచి మహేంద్ర రూ. 50 వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీసుకునేటపుడు రెండు నెలలకే ఇస్తానని చెప్పి, తరువాత ఇవ్వలేదు. దీంతో రోజూ సాయికిరణ్‌ తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వలేదని మహేంద్రతో గొడవపడేవాడు. ఆదివారం మధ్యాహ్నం టీ స్టాల్‌ వద్ద గొడవపడిన వారు, మరలా రాత్రి 9 గంటల సమయంలో అదే టీ స్టాల్‌ వద్ద కలుసుకున్నారు. సాయికిరణ్‌ తన డబ్బుల విషయం అడుగగా.. మహేంద్ర తన వెంట తెచ్చుకున్న కత్తితో అతని కడుపులో ఒకే ఒక్క పోటు పొడిచాడు. ఈ సంఘటన జరిగిన వెంటనే మహేంద్ర కారులో సాయికిరణ్‌ను స్థానికుల సహకారంతో ప్రైవేట్‌ ఆసుపత్రికి తీసుకుని వెళ్లాడు. అక్కడ డాక్టర్లు సాయికిరణ్‌ చనిపోయాడని తెలపడంతో.. కారులో మృతదేహాన్ని కడప చిన్నచౌక్‌ పోలీస్‌స్టేషన్‌ వద్దకు తీసుకునివచ్చాడు. కారును కూడా అక్కడే వదిలేసి పరారయ్యాడు. గమనించిన పోలీసులు సాయికిరణ్‌ మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుడి తండ్రి రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ సంఘటన కేవలం డబ్బుల లావాదేవీ వల్లనే చోటుచేసుకుందని తెలియజేశారు.